# B. A. స్టూడెంటు

"బైరెడ్డి రామిరెడ్డి"

బీడీల్, కిళ్లీల్, సోడా, గరం గరంఛా, అదీ యిదీ అంటూ నోరు చినిగేటట్టరుస్తున్నారు సోనాపూర్ స్టేషన్లో. కాస్సేపట్లో కదుల్తుంది రైలు. దిగేవాళ్ళకి, ఎక్కేవాళ్ళకి విరగడ, తరగడలేకుండా యుంది. ఆ గుంపులో వాళ్లిద్దరేంటో ముచ్చట్లాడుతున్నారు:

"నేనెళ్లి రానా, ఇందిర్? అదేంటి, కంట తడిపెడ్తున్నావ్?"

"పాడుజీవితం! కూడటం వీడటానికేకదూ జీవన్?"

"అచ్చే! ఈ యెడబాటంత రెండురోజులే. అటుపైని మళ్ళీ కలుసుకుంటాంగా! ఇంతపాటికే యేంటికలా దురపిల్లటం?"

"మీయూరికెళ్ళటంతోనే, ఓకమ్మ పడేయ్యండి."

"కమ్మగాదు—కమ్మనిముద్దు పడేస్తానక్కడుంచీ. పుచ్చుకుంటావా, నొచ్చుకుంటావా?" ఇందిర లేతకిసలయాల్లో, ముసిముసి నవ్వులు మెరసిపోతున్నాయి. క్రిందిచూపెట్టి కాలితో నేల రాస్తూంది. ఆమె గుల్బాబీపైట గాలికి జీవన్‌పై వాల్తూంది.

ఇహ రైలు గఫ్, గఫ్‌మంటూ దెయ్యంలాగ తనదెబ్బ కొట్టింది. ఎక్కడోళ్ళక్కడ ఆగిపోతున్నారు. జీవన్ ఇందిరలు కడసారిచూపు, చేతుల వూపు అందుకున్నారు. ఒకళ్ళనొకరు చేతిగుడ్డలతో పిల్చుకుంటున్నారు. బండి దృష్టికి అందకుండ దాటిపోయింది. ఇందిర అలాగే ప్లాటుఫారంపై నిల్చుని దశదిశల్లో దైన్యదృక్కుల్ని తరుముతూంది. తన సొమ్ము పోగొట్టుకొని బీదమొగంతో యింటికి పోతోంది.

సెంట్ థామస్ కళాశాలలో జీవన్, ఇందిర లీఏడు బి. ఎ. జీవన్ అట్టె గొప్ప ఆస్థికల్లోడుగాడు. ఐతే ఇందిర కమీషనర్ గారి అమ్మాయి. పదారేళ్ళ పడుచు; సౌందర్యముద్ద. నవయవ్వనంతో మిసమిసలాడ్తూంటుంది. మెత్తగ నున్నగవుంటాయి ఆమె చెక్కిళ్లు; చిలిపితనం వులకబోస్తోంటాయి కళ్లు; ఉబలాటలాడ్తూంది యురము. ఆమె జీవనుని గాఢంగ వలచింది. ప్రేమరాజ్యానికి రాణీ, రాజులు వాళ్ళే. వేసంగి సెలవులలో అతడు వారీపూర్ కెళ్లాడు. ఆమె కూడ రైల్వేస్టేషనుకెళ్లి సాగనంపి తిరిగొచ్చింది.

"అన్నయ్యా—మా అన్నయ్య వస్తున్నాడు! నాన్న పొలాలకేసివెళ్లాడు. నాకేంతేలేదన్నయ్యా?" అంటూ కప్పగంతులేస్తూ, చిందులు ద్రొక్కుతూ జీవన్‌వద్దకి అతడిచెల్లి సరళ, యురికింది. "ఇదిగో! నీకీ చక్కనిబొమ్మ తెచ్చేను."

"మామంచి బొమ్మ! ఎంత దుబ్బగాయుంది" అన్న, చెల్లి యిలా తమాషాగ సంబరపడుతుంటే, కూలోడొచ్చి "జీవన్న బాబయ్యా! బండి వాటుబడి, మీ అప్పగారిమీదగాను దొర్లింది. ఇహ, బతుకుతాడో, బతకడో"నని గుభాలున ఏడ్చేడు. అలాగానా, అలాగానా అంటూ కళ్లు మబ్బులుగప్పి, లేస్తూ పడుతూ పరిగెత్తాడు జీవన్. అడికెళ్లేటప్పటికి జనమంత కట్టలు కట్టుకొని మూగిండారు. జీవన్ అందర్ని నెట్టుకుంటూ తండ్రిదగ్గర పడిపొయ్యాడు. కొడుకిని చూట్టంతోనే తండ్రి ఆశ చిగిర్చి లేవబోయాడు. వచ్చిరాని గొంతుతో అన్నాడు: "జీవన్! నీ బ్రతుకెలా పరిణమిస్తుందో. బాబూ, పోతున్నాను మిమ్మల్ని దిగవిడిచి. చెల్లికి నీ... వే.." మాటలాగిపోయాయి. మరోక్షణంలో అన్నీకూడ ఆగినాయి. జీవన్ కంటినుంచి, మంటికి నిర్భాగ్య నీటిచుక్కల్ని విడుస్తున్నాడు. వెఱ్ఱిమొఱ్ఱి చూపుల్తో చుట్టు పట్టుయుంటేవాళ్లని పితృభిక్ష పెట్టమని బ్రతిమలాడ్తూన్నట్టుంది. అయ్యయ్యొయ్యో అన్నారు అక్కడుంటే వాళ్ళంతాను.

మరుసటిదినం అవూళ్లో పుకారా చెలరేగింది. జీవన్, యిల్లు భూములకు జప్తీవస్తుందని ప్రతీవాడి నోరు పలుకుతూంది. తగిలిన వ్రేలుకే సారిసారికీ తగులుతూంటుంది. సరళ "నాన్న, నాన్న" అని కలవరిస్తూ జబ్బుపట్టి మంచమెక్కి పడుకుంది. జీవన్ సరళని బుజ్జగిస్తూ, "నా పాడు చదువుకోసం మా నాన్న యావదాస్థి తగిలేసాడే? దేముడా యెలారా పొట్టగడిచేది?" అని కుమిలిపోతున్నాడు. అప్పుడే అమీనా, అప్పుదార్లు వచ్చారు. బోకి, బోలెతోసహా అన్నీ బయటేస్తున్నారు జప్తీదారులు.

ఆ మాటావిడి విని సరళ దిగ్గునలేచి కూచుంది. అన్న వేపు తేరిపార జూచింది. అతడు పాలిపోయిన ముఖంతో కళ్ళమ్మట చేతకాని రక్తపుబొట్లని జారవదుల్తున్నాడు. అమ్మాయి క్రిందదిగి, "నా బొమ్మని తీసికెళ్లుతావా?" అని జవాన్ని గట్టిపట్టుకు పీకులాడ్తూంది. "ఛట్ వెంకిపిల్లా! నీగోలేంటి?" అని నిర్దాక్షిణ్య చేతితో నేల త్రోశాడు. దభల్లుమని బారెడుదూరంలో విసరిబడ్డది. చిట్టితల్లి! బుఱ్ఱ పగిలింది; బొటబొట నెత్తురు దూకుతూంది. జీవన్ భరించుకోలేక పొయ్యాడు. అతడి దృష్టిలో ప్రపంచము తిరిగిపోతోంది. వొళ్లు చిమచిమ మండిపోతోంది. కోపాన్ని ఆపుకోలేక జీవన్ గుబాలున జవానుగాడిమీద కుప్పించి పట్టుడుకర్రతో వాడి బుర్ర చిదుకగొట్టేడు. "అమ్మోయ్, చచ్చానురా దేముడా," అంటూ భూమికొరిగాడు జవాన్. నోట బురుగు కక్కుతున్నాడు. వాడి అవస్థచూచి జీవనే జాలిపడ్డాడు. ఇంతలో పోలీసు కానిస్టేబుల్స్వచ్చి సంకెళ్లు తగిలించి లాక్కెళ్లుతున్నారు. "అన్నయ్యా ఎక్కడ్డో పోతున్నావే" అంటూంది సరళ. జీవన్ గుండె చీలిపోతోంది. ఎక్కడ పోతున్నాడనుకుందో పాపం, పిచ్చిసరళ! దిక్కులేని చీకటి కారాగృహ కొట్టులోకే!

మూడేళ్లు దాదాపు కావస్తున్నాయిప్పటికి. మాసినగడ్డం, మొద్దుబారిన మొగం, కరుడుకట్టిన వెంట్రుకలు, 4-వ నెంబరు చొక్కా, బుజాన నీటిబుంగ, మోకాళ్ళపైకి పొట్టినిక్కరు—వీటితో వీధిలో నడవాలంటే సిగ్గేసింది కాబోలు వంచిన తలయెత్తకుండా వదుక్కుని చక్కా పోతున్నాడా వ్యక్తి. మసక మసకగ రవి రశ్మి చెరువులో తాండవమాడ్తూంది. ఒడ్డున ఖైదీలనడుమ నిల్చొని, యిలాగొనుక్కుంటున్నాడతడు: "దేవుడనేవాడే యుంటే నేనిక్కడ, నా చెల్లి అక్కడ దేశమ్మ కాకులమై పోతామా? చివరకి యిలా ముగిసిందా నా బ్రతుకు? ఎందుకొంచ్చిందీ వ్యర్థపుచదువంతాను? ఈ రాత్రి గడిసిందంటే, జైలు ప్రాప్తితీరుతుందిగా? రేపు స్వతంత్ర మనుష్య సంఘాల్లో మాటాడ్తానుగా? ఎలాగైన శిథిలమైన ప్రపంచకంతో, హృదయంలేని ప్రపంచకంతో నాకు పనిలేదు. నాకు సరళే సర్వం. చెల్లీ, యెలా తంటాలు పడ్తున్నావో? అసలు ప్రాణంతోనైన యున్నావా?" అప్పటికి పడమటి కొండలో దొండపండులా సూర్యుడు నక్కి, నక్కి దాక్కుంటున్నాడు. ఖైదీలందరు నీళ్ళతోడికొని చెఱువునుండి దాటిపోయారు.

హరిపూర్‌లో ప్రతీయిల్లు, ప్రతీమూల, ప్రతీగొందు పిచ్చెత్తినోడిలాగ వెదుకుతున్నాడు జీవన్. తన సరళ యెక్కడా కనుపించుటంలేదు. ఎవళ్ళనడిగాగూడ, మాకు తెలియదని కొబట్టినట్లు చెప్పేసారు. అతడి మెదడిని కంపితశక్తులు, కృష్ణచక్రవాటాన గిరగిర త్రిప్పేసాయి. ప్రకృతికూడ, సరళ సోద యెవడికి కావాలంటూంది. అబ్బ! లోకం యెంత గడుసుదిరా? ఏకాస్తో కూస్తో ఆనందాన్ని యిచ్చే సరళకూడ అతడికి లేకుండ పోయిందే! జీవన్ తత్త్వములో గొప్పమార్పు బయట పడింది. "ఏమీగాని, యెవ్వరూగాని లేనివాన్నయ్యాను. ఇవా, ఊరూరుతిరుక్కుంటూ, భుక్తిచిక్కించుకుంటేచాలు. యాచన నీచమన్నాయి శాస్త్రాలు. ఆత్మగౌరవం కాశీవాడికి ముష్టి చెడ్డదే! స్వాభిమానాన్ని గెంటేసిన సన్యాసోడికి భిక్షయెలాతప్పింది? కడకి నేనిలా మారుతానని యెవరైన అనుకున్నారా? విధాత నొసటి వ్రాతని యెవరడ్డుపరుస్తారు? ఎలా తెల్లవారాలో, అలాగే తెల్లవార్తుంది." గట్టిగ మనస్సు దిట్టపరుచుకొని జీవన్ పట్టణాలు, పల్లెలు గాలించటం మొదలెట్టాడు.

పగలు పదకొండు గంటలయింది, నిండు వేసంగి అవటంతో బహు చురుగ్గా యున్నాడు సూరయ్య ఆకాశంలో. ఓ అమ్మాయి తలుపు వద్దకి వెళ్లుతూ తెలసి, తెలియని పాటపాడ్తూ, దీనంగా అన్నమడుగుతూంది, ఫర్లాంగు దూరంలో పోతోంటే యొకమనిషి, పాటవింటూనే గిర్రున వెనక్కిమళ్లాడు. ఆపిల్ల కూడ ఆలింపు చాలించి తదేకంగ అతడినే చూచింది. హఠాత్తుగ ఒకరినొకరు, "చెల్లీ, అన్నా" అని చేతులూపుకున్నారు. పట్టరాని ఆదుర్దాతో, యిద్దరు యెదురెక్కి పరుగెత్తారు. బజారులోనివాళ్ళంత నివ్వెరపడ్తూ, దయితో చూస్తున్నారీదృశ్యాన్ని. భిక్షగాళ్ళ ప్రేమ గూడ ఒహప్పుడితరుల దయని గుంజుకుంటుంది కాబోలు!

అటూ, యిటూ దొర్లిపోయినాయి నాలుగైదు దినాలు. పద్మనదిమీదుగ పొడుగాటి చెట్టొహటుంది. జీవన్ సరళని యొక చావిటో విడిచిపెట్టి,

పోయిలోకి పుడకలకోసం దాన్ని యెక్కాడు, పెద్ద ముత్తయిదు పాపట్టుబొట్టులాగు, ఎఱ్ఱనిరంగుల్లో కూకుతున్నాడు ముసలిసూర్యుడు. గాలి జోరుగ వీస్తోంది. దుమ్ముదుమారము పైకి కొట్టుతూంది, చెట్లు దడదడలాడ్తూంది. కొమ్మలు, రివ్వున వంగుతున్నాయి. అంతై, యింతై తుదకీ తుపాను పుట్టింది, ఆయూళ్ళో పూరిగుడిసెలు, యెప్పుడెప్పుడాని కాచుకొంతే షడ్డ పెంకుటిండ్లు కూల్తున్నాయి. దిగాలని జీవన్ చిట్టచివారి రెమ్మనుండి ప్రక్కని కొమ్మమీదికి కాలెద్తుండగనే, ఫెల్లున విరిగింది కొమ్మ. జీవన్ కెవ్వున కేక వేస్తూ అంతయెత్తునుండి పడ్డాడు; ఆదరిద్రతమ్ముడి అరుపు ఆచోటంతా గింగురులేపింది.

ఏటికి వెనకాటి భాగంలో దర్జాయైన మిద్దొహటుంది. దాంట్లో యీమధ్యనే సంసారం జేస్తున్నాడొక ఆవేకారి. జీవన్ మొత్తుకోటం వింటూనే, మబ్బులో పెట్రొమాక్సు లైటు పుచ్చుకొని, ఆ యింట్లోనుండి యువకస్త్రీలిద్దరు యెకాయెకిగ ఆ ప్రదేశానికొచ్చారు. గాయాలు దిని, తెలివిదప్పి స్రుంగిపోయిన జీవనుని కనుక్కున్నారు. ఎంతో యుదారగుణంతో మేడపైకి యెత్తుకపోయి, కట్లు గట్టి, ఉపచారాలు జేస్తున్నారు. కొద్ది ఘడియలకి జీవన్‌కి మెలకువవచ్చింది. ఆయాసపడ్తూ మూల్గుతూ, దప్పి, దప్పి అని నంగినంగిగ అడిగాడు. చల్లటినీల్లందిస్తే త్రాగి కళ్లువిప్పేసరికి తానొక మహల్‌లో యున్నట్టు గ్రహించాడు. అక్కడికెలావచ్చాడో తనకే అనుమానంతోచింది. అక్కడా, యిక్కడా చూశాడు. ఒక స్త్రీ గురకలుపెట్టి నిద్రపోతోంది; ఇంకోఆమె కుర్చీలోకూచుని యేంటో ఆలోచనా తెప్పమీద మునుగుతూ, తేలుతూన్నట్టుంది. ఆమెను పిలుద్దామా, వద్దాని శంకిస్తూ, చివరికి ఖాయపరచుకొని మెత్తగా, "ఎవరండీ మీర"న్నాడు. ఆకంఠం వింటోనే ఉలిక్కిపడిందామె. ఎప్పుడో విన్నట్టుందా గొంతు. అతడి వికారవాలకాన్ని జూచి నిరుత్సాహ యూపిరి సాగదీసి విడిచిందామె. ఎలాగైన, ఆమెలో సన్నసన్నగ ఒహ గందరగోళం బయలుదేర్తూంది. ఇలా జవాబిచ్చింది: "నేనా? ఆ...చెబుతాను. మొదలు మీదేయూరు?"

"అడుక్కునేవాడికొక యూరు, యొకగోడి అనియుందా? దేశాలన్నీ మావే. దేశాలన్నీ మావికాదు."

"చిన్నప్పటినుంచి యిలాగే యాచకునివేనా? కాక, యీ నడుమనే భిక్షకా వృత్తికి దిగావా?"

"మా ముతాలో సుద్దులన్ని యిప్పుడెల్లబోయటమెందుకు లెండి. ముష్టోడి ముచ్చట్లెంత ఖులాసాగా యుంటాయి. అబ్బా, అబ్బా, నొప్పి!"

"నొప్పి తగ్గిపోతుందిలే. వినుకోకుండ యిదోహటి చెప్పి పడుకో: నీకు పెళ్లయిందా?"

"పెళ్ళి!...పె...ళ్ళి! నేను B. A. చదువుకునేటప్పుడు...",

"ఆ...ఆ...మీరు B. A. నా? ఏ కళాశాలలో? తక్షణమే చెప్పేసెయ్యండి."

"ఏంటండీ కంగారుపడ్తున్నారు? సెంట్ థామస్ కాలేజిలో స్టడీచేసేవాన్ని. కడకిలా అయ్యాయి నాచదువు, సంధ్యలు." ఆమె నాలుకపై తేమ ఆరిపోతోంది. ఆతురతతో కొట్టుకుంటూంది గుండె, అతడు తప్పకుండ తన జీవన్‌యై యుండాలని నిశ్చయించుకుంది. ఇహ ఇందిర ఓపిక చిక్కబట్టలేకపోయింది. చటుక్కున లేచి జీవన్ చేతులు పట్టుకుని, వణుకుడు స్వరముతో అంది: "జీవన్, గుర్తుపట్టలేకపొయ్యాను. నీవలా, నేనిలా మారుతామని కలలోగూడ కనలేదే? ఎప్పటికైనా, నేను నీ ఇందిర నేకదూ?" జీవన్‌లో ఒక్కసారిగ ఆనందాశ్చర్యాలు బజాయించాయి. "ఇందిరా. ఇందిరా", అంటూ ఆమె వక్షంపై తలనిలిపి, జీవన్ మురిసిపొయ్యాడు.

భేష్! ఇదివరకి ప్రేమించిన ప్రియుడిపుడు భిక్షగాడైన. గొప్ప భాగ్యవంతుడి బిడ్డ మళ్ళీ అతన్నే లాలించి, తన ఒంట్లో పడేసుకుందే! క్రిష్ణయ్యా, ప్రేమకిరణమే పెద్దదోయ్!

వచ్చే నెల సంచికలో

సౌమిత్రి వారి "తాజ్‌మహల్",

ఎ. సత్తిబాబు "పరిణామం"

చక్కని కథలు వెలువడుతుంది.